క్లుప్తంగా

వైభవంగా అశ్వర్థ నారాయణుడి కల్యాణం



అశ్వర్థ నారాయణస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సంగం: సంగంలోని స్థానిక సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా మంగళవారం అశ్వర్థ నారాయణస్వామి కల్యాణమహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా రాగి, వేప చెట్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాగి, వేప చెట్లకు వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్షేత్రసహాయకుడిపై డ్వామా ఏపీడీ విచారణ



విచారణ చేపడుతున్న ఏపీడీ గాయత్రీదేవి

వరికుంటపాడు: వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి క్షేత్రసహాయకుడు మాలకొండయ్యపై అనేక ఫిర్యాదులు రావడంతో ఉదయగిరి క్లస్టర్ డ్వామా ఏపీడీ గాయత్రిదేవి మంగళవారం గ్రామంలోని సచివాలయం వద్ద విచారణ చేపట్టారు. ఈ నెల 1న జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురు కూలీలు క్షేత్రసహాయకుడు మాలకొండయ్యపై అనేక ఫిర్యాదులు చేశారు. పనులు కల్పించడం లేదని, నగదు వసూలు చేస్తున్నాడని అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో ఆమె క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రసహాయకుడిపై వచ్చిన ఫిర్యాదులను విచారించామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.


నాడు-నేడు పనుల పరిశీలన



సంజీవరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సంజీవరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల పెరుగుదల చార్టును పరిశీలించారు. పెరుగుదల లోపమున్న చిన్నారులను వెంటనే గుర్తించి వైద్యులకు రిఫర్ చేయాలన్నారు. ఆయన వెంట డీఈఓ గంగాభవాని, పలు శాఖల అధికారులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన డీఈఓ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ గంగాభవాని

ఉదయగిరి: ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం డీఈఓ గంగాభవాని పరిశీలించారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులు, భోజనం చేస్తున్న సంఖ్యను సరిపోల్చారు. 305 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద, పోషక విలువలతో కూడిన ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. ఆమెతో పాటు ఎంఈఓ మస్తాన్‌వలి, పాఠశాల హెచ్‌ఎం ఉన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సిమెంటు రోడ్డు పనులు చేయిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని 14వ వార్డులో కౌన్సిలర్ పాడమేకల పెంచలయ్య ఆధ్వర్యంలో అంతర్గత సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. మంగళవారం యాదవవీధిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను జేసీఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమానికి జగనన్న సు‘రక్ష’

ఏళ్ల తరబడి సమస్యలకు తక్షణ పరిష్కారం

- ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చాలన్న లక్ష్యం
- అర్హత ఉన్న లబ్ధిదారుల్లో ఆనందం



ధ్రువీకరణపత్రాలతో ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజన మహిళలు

అర్హత ఉండి సాంకేతిక సమస్యల కారణంగా ఆ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని పరిస్థితి. అటువంటి వారు ప్రభుత్వ పథకాలు అందుకునేందుకు ఉన్న అడ్డంకులు తొలగించి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు చేపట్టిన జగనన్న సురక్ష ఎంతగానో ఉపయోగపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షతో ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలకు తక్షణమే లభించింది. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో మేలు చేకూర్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి ప్రజాదరణ వెల్లువెత్తుతోంది.

1,677 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సంగం: సంగంలోని సచివాలయం–3లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వివిధ రకాలైన 1,677 ధ్రువీకరణ పత్రాలను అందించినట్లు ఎంపీడీఓ గోపీ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించడంతో వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అడిగి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు

చేజర్ల: ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే లబ్ధిదారులు గతంలో పరుగులు తీసే పరిస్థితి ఉండేది. సచివాలయ వ్యవస్థ వచ్చాక ఆ సమస్యలు తీరినా.. సాంకేతిక సమస్యల కారణంగా ధ్రువీకరణ పత్రా లు జారీలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, అక్కడికక్కడే అందజేస్తుండడం చరిత్రాత్మకమని చేజర్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాడేరు, చిత్తలూరు సచివాలయాల్లో మంగళవారం తహసీల్దార్ వి రామ్మోహన్‌తో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ రామయ్య, సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు పంచాయతీ సెక్రటరీ శ్రీను, వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో

మండలంలోని ఉప్పలపాడు, మంచాలపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తోందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, జేసీఎస్ కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సర్పంచ్ ఎస్‌కే మస్తానమ్మ, వెంకటేశ్వర్లురెడ్డి, మహేష్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమం

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో, ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమం సాధ్యమని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని కొరుగుంటలో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌లో ఆయన సర్టిఫికెట్లను మంజూరు చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పండగలా జగనన్న సురక్ష

అల్లూరు: మండలంలోని బీరంగుంట లో జగనన్న సురక్ష సర్టిఫికెట్ల కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. బీరంగుంట సర్పంచ్ మడపర్తి కవిత, నార్త్ ఆములూరు సర్పంచ్ కరిముల్లా షాఖాదర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్ ఎంపీపీ సురేంద్ర, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

వరికుంటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాసంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందుతున్నాయని వరికుంటపాడు మండల జెడ్పీటీసీ ఆర్.నాగేంద్ర, ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, సొసైటీ అధ్యక్షుడు కె.వెంకటరత్నం తెలిపారు. మంగళవారం మండలంలోని తోటలచెరువు పల్లెలో సర్పంచ్ పి.మౌలాలి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షలో మాట్లాడారు. తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంఈఓ షావుద్దీన్, పీఆర్ ఏఈ నందకిషోర్, సర్పంచ్‌లు రంగయ్య, నారాయణమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలీఅహ్మద్, డైరెక్టర్ దాసరి యర్రా ఓబయ్య, కార్యదర్శి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరం మండలం మంచాలపల్లిలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకువస్తున్నారని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి తెలిపారు. అనంతపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. ఎంపీపీ మెట్టుకూరు శిరీష, ఎంపీడీఓ ఆర్వీ కణాధర్ రావు, తహసీల్దార్ శ్రీరామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వందల మందికి వరం జగనన్న సురక్ష

ఆత్మకూరురూరల్: సచివాలయాల స్థాయిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి గ్రామంలో వందలాది మందికి వరంలా మారిందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని బోయలచిరివెళ్లలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం స్వాతంత్ర్యపోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 120వ జయంతి సందర్భంగా స్థానిక సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనరసింహం, వ్యవసాయ అధికారి కిషోర్, మండల పరిషత్ ఏఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ ఉషారాణి, స్థానిక నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు, రావూరు శ్రీనివాసులురెడ్డి, వెంకట రత్నాకర్‌రెడ్డి, కరేటి హజరత్ రెడ్డి పాల్గొన్నారు.

మూడేళ్ల సమస్యకు పరిష్కారం



కొమరిగిరి కామాక్షయ్య ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరు పాళెం గిరిజన కాలనీ. వీరికి మూడేళ్ల క్రితం భార్య రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే వైఎస్సార్ జగనన్న కాలనీలో స్థలం మంజూరై గృహ నిర్మాణశాఖ ద్వారా ఇంటి నిర్మాణానికి అనుమతులు లభించాయి. బేస్‌మెంట్ వేసిన కొద్ది రోజులకే భార్య మృతి చెందడంతో ఇంటి నిర్మాణ పరిస్థితి నిలిచిపోయింది. తిరిగి నిర్మించుకుందామంటే భార్య మృతి చెందడంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకు రావాలని అధికారులు తెలిపారు. మూడేళ్లుగా అతని సమస్య పరిష్కారం కాలేదు. జగనన్న సురక్షలో సమస్య పరిష్కారమైందని సంతోషం వ్యక్తం చేశాడు.

ఇప్పటికి కులం సర్టిఫికెటు వచ్చింది



ఈమె పేరు దాసరి రమణమ్మ నెల్లూరు పాళెం గిరిజనకాలనీ. ఐదేళ్ల క్రితం ఆమె భర్త చనిపోవడంతో పింఛన్ మంజూరు చేసుకునేందుకు, ఇతర ప్రభుత్వ పథకాలు అందుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. అయితే ఈమె ఇంటి పేరు ‘దాసరి’ కావడం, ఆ పేరు గిరిజన కుటుంబాలకు ఉండదని అప్పట్లో అధికారులు మంజూరు చేసేందుకు నిరాకరించారు. జగనన్న సురక్షలో భాగంగా వలంటీరు అనూష బాధితురాలి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆమె సమీప బంధువు నెల్లూరులో కుల ధ్రువీకరణ పత్రం పొందిన రుజువులను అధికారులకు చూపడంతో సమస్య పరిష్కారమైంది. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమెకు సర్టిఫికెటు అందజేశారు.

అర్హులందరికీ పథకాలు

దుత్తలూరు: అర్హతగల ఏ ఒక్కరూ నష్టపోకూడదన్న సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని భైరవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు అడుసుమల్లి శ్రీహరినాయుడు, సర్పంచ్‌లు రమణమ్మ, సుబ్బరాయుడు, నంబూరి వసంత, ఎంపీటీసీ పోలు సుజాత, తహసీల్దార్ సోమ్లానాయక్,ఎంపీడీఓ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కావలి: సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు



అల్లూరు: సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎంపీపీ శశిరేఖ



సర్టిఫికెట్లు అందిస్తున్న ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ చిరంజీవిరెడ్డి



బోయలచిరివెళ్లలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



జగనన్న సంక్షేమ బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల్లోని పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అల్లూరుపేట సత్రంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలను కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రజలకు పారదర్శంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి నవరత్నాల లబ్ధి చేకూరిందన్నారు. జగన్ నాయకత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఎంపీపీ శశిరేఖ, కమిషనర్ ఫణికుమార్, నాయకులు నీలం సాయికుమార్, మేడా కృష్ణారెడ్డి, షేక్ ఉస్మాన్ షరీఫ్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సాధిక్‌రెడ్డి, నిమ్మల భాస్కర్, పాండురంగారెడ్డి, బత్తల మోహన్‌రెడ్డి, గోళ్ల రాజేష్, పోలయ్య, పాల శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 మోటార్లు, రాగి వైర్లు చోరీ


అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం శ్రీకొలను పొలాల్లో సోమవారం రాత్రి దాదాపు 40 మోటార్లను అపహరించారు. పొలంలో వరి నారుమడులు వేసి ఉండడం వల్ల మోటార్లను సిద్ధంగా ఉంచుకున్నట్లు, అయితే వీటిని సోమవారం రాత్రి దొంగలు దొంగలించి, వాటిల్లో రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు రైతులు వాపోయారు. ఈ మేరకు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): పొదుపు సంఘాల్లో పనిచేస్తున్న మహిళా పారిశ్రామికవేత్తలకు డీఆర్‌డీఏ భాగస్వామ్యంతో బ్యాంకు రుణాలు అందజేస్తామని మర్రిపాడు వైఎస్సార్ ఐకేపీ ఏపీఎం బుజ్జమ్మ, పలువురు బ్యాంకు మేనేజర్లు తెలిపారు. మర్రిపాడులోని వెలుగు కార్యాలయంలో మంగళవారం పొదుపు సంఘాల మహిళలతో బ్యాంకర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బ్యాంకు ఖాతా కలిగిన మహిళలకు ఆర్థిక లావాదేవీలతో పాటు సిబిల్ బాగుంటే రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. వ్యక్తిగత రుణాలకు కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మర్రిపాడు ఏపీజీబీ మేనేజరు రంజిత్‌కుమార్, కృష్ణాపురం బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజరు ప్రతాప్, డీసీపల్లి కెనరా బ్యాంకు మేనేజరు రవికిరణ్, పలువురు పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం

- 2024లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయం
- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి
- ఉదయగిరి బహిరంగ సభావేదికను పరిశీలన



ప్రభుత్వ పాఠశాలలో సభాప్రాంగణం పరిశీలిస్తున్న మేకపాటి సోదరులు

ఉదయగిరి: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో గత మెజార్టీలను తలదన్నేలా భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం తథ్యమని, రెండో సారి సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగే తన సోదరుడు, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పరిచయ వేదిక బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమోహన్‌రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త రాజారెడ్డి, మేకపాటి అభిషేక్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పిన హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అన్నింటినీ సమన్వయం చేసుకుని అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే మంచి పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తారన్నారు. ఉదయగిరిలో రాజారెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఉదయగిరి సమన్వయకర్తగా తన చిన్న తమ్ముడు రాజారెడ్డిని సీఎం నియమించారన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. పార్టీలో నాయకుల మధ్య చిన్న చిన్న సమస్యలున్నా అన్నింటినీ పరిష్కరించుకుని ముందుకు సాగుతామన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి – మేకపాటి రాజారెడ్డి

ఉదయగిరిలో బుధవారం సాయంత్రం మూడు గంటలకు జరిగే పరిచయ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి కోరారు. ఈ సమావేశానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పెద్దలు హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన చిన్న స్థాయి నుంచి పెద్దస్థాయి వరకున్న ప్రజాప్రతినిధులందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో త్వరలో చేయబోయే గౌతమ్‌రెడ్డి స్మృతివనం స్థలాన్ని మేకపాటి సోదరులు పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వారి వెంట జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ నేతలు మూలె వినయ్‌రెడ్డి, మూలె వీరారెడ్డి, గోగుల వెంగల్ రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, సీఎం ఓబుల్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి, కల్లూరు కృష్ణారెడ్డి, మూలె సుబ్బారెడ్డి, గాజుల షర్ఫుద్దీన్, కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి, మట్ల లక్ష్మయ్య, సిఐ వి.గిరిబాబు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి, తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు కలెక్టర్‌కు ఆదేశాలు

- తహసీల్దార్, ఎంపీడీఓపై కలెక్టర్ ఆగ్రహం



సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

వింజమూరు (ఉదయగిరి): జగనన్న సురక్ష ధ్రువపత్రాల జారీలో పూర్తి స్థాయిలో తగిన ఏర్పాట్లు చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చాకలికొండ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డిపై మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫోన్‌లో డీపీఓతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో సరైన ప్రణాళికలు రూపొందించంలో విఫలమైన తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎంపీడీఓ రాజేష్‌పై కూడా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఎవరైనా ధ్రువీకరణ పత్రాలు అందలేదని ఫిర్యాదుచేస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. చాకలికొండలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని, ఉదయగిరి ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ వెంకట్రావుకు నివేదిక ఇవ్వాలని చెప్పారు.